
సాక్షి గుంటూరు

శనివారం । 14 । జూన్ । 2025



అమ్మవారి ఆలయంలో చండీ హోమం

దుగ్గిరాల: మండలం కంఠంరాజు కొండూరులో గల మహంకాళి ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఇరుముడి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.90 అడుగుల వద్ద ఉంది. ఇది 136.6461 టీఎంసీలకు సమానం.

రేపు చర్చి వార్షికోత్సవం



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్) :పునీత ఆంథోని పుణ్యక్షేత్రంలో 35వ వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు విచారణ గురువు, రెక్టార్ ఫాదర్ కొచ్చెర్ల జ్యోతిరాజు తెలియజేశారు.

న్యూస్‌రీల్

స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా బ్రోచర్ ఆవిష్కరణ



గుంటూరు ఎడ్యుకేషన్: చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతరిక్ష విజ్ఞానంపై నిర్వహిస్తున్న కార్యక్రమాల బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లోఆవిష్కరించారు. స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కలిగిస్తూ, ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

దుగ్గిరాలలో అత్యధికంగా 28.8 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 10 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 28.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.4 మి.మీ. పడింది. సగటున 3.8 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. చేబ్రోలు మండలంలో 9.2 మి.మీ., కాకుమాను 7.8, గుంటూరు పశ్చిమ 6.2, పొన్నూరు 4.8, పెదనందిపాడు 4.6, మంగళగిరి 2.2, ఫిరంగిపురం 2.2, ప్రత్తిపాడు మండలంలో 2 మి.మీ. చొప్పున వర్షం పడింది.

16న ఐటీఐ విద్యార్థులకు ప్రాంగణ ఎంపిక

తెనాలి టౌన్: స్థానిక చినరావూరు ఐటీఐ కళాశాలలో ఈనెల 16న నిర్వహించనున్న ప్రాంగణ ఎంపికలను ఐటీఐ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు పాల్గొని ఉద్యోగాలు సాధించాలని ఆయన సూచించారు. ఉదయం 10 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని, ఐటీఐ రెండో సంవత్సరం విద్యార్థులంతా పాల్గొని ఉద్యోగాలు పొందాలని ఆయన కోరారు. దాదాపు 15 మల్టీలెవల్ కంపెనీలు పాల్గొంటున్నట్లు వివరించారు.

బుద్ధవనం ప్రాంగణంలో 18న యోగాంధ్ర




అమరావతి: స్థానిక ధ్యానబుద్ధ విగ్రహం ఎదురుగా ఉన్న బుద్ధవనం ప్రాంగణంలో ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించటానికి ఏర్పాట్ల గురించి అధికారులతో సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంతరెడ్డి సమావేశమయ్యారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటుపాట్లు చేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పార్వతి, తహసీల్దార్ డానియల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశం

గురజాల: ఈ నెల 15వ తేదీన జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షుడు సిద్దాడపు గాంధీ యాదవ్ శుక్రవారం ఓ పత్రికా ప్రకటలో తెలిపారు. సమావేశం బస్టాండ్ ఎదురు గల పల్నాడు కన్వెన్షన్ హాల్‌లో 15న ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ హాజరవుతారని తెలిపారు. మాచర్ల, గురజాల నియోజకవర్గ పరిధిలోని బీసీ, మైనార్టీ నాయకులు పార్టీలకతీతంగా పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2200, గరిష్ట ధర రూ.3200, మోడల్ ధర రూ.2600 వరకు పలికింది.

కూటమి ప్రభుత్వం మాట తప్పింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి తూట్లు పొడిచింది. ఇంట్లో చదువుకునే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకం ద్వారా రూ.15వేలు ఇస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం తల్లులకు వెన్నుపోటు పొడిచింది. సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన తల్లికి వందనం నిధులను విడుదల చేస్తున్నామంటూ ఆర్భాటంగా ప్రభుత్వం ప్రకటనలు చేసింది. తీరా జీవోల్లో పేర్కొన్న మార్గదర్శకాల్లో విధించిన ఆంక్షలతో వేలాది మంది అనర్హులయ్యారు. అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత పథకం అమలుపై ఆర్భాటంగా ప్రకటనలు చేసిన ప్రభుత్వం, లబ్ధిదారుల ఎంపికలో ఆంక్షలు విధించడంతో అర్హులైన తల్లులు, విద్యార్థులు తీవ్రమైన నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు.

తల్లికి వెన్నుపోటు



- తల్లికి వందనం ఇస్తున్నామంటూనే ఆంక్షలు
- గుంటూరు జిల్లాలో 1,60,000 మందిపై అనర్హత వేటు
- గ్రామాల్లో నెలకు ఆదాయం రూ.10వేలు, పట్టణాల్లో రూ.12వేలకు మించితే పథకానికి కోత
- 300 యూనిట్లకు దాటి విద్యుత్ వినియోగించినా అనర్హత వేటు
- వై.ఎస్. జగన్ ప్రభుత్వంలో నాలుగేళ్ల పాటు ఆంక్షలు లేకుండా అమ్మఒడి అమలు
- ఆంక్షల ముసుగులో తల్లికి వందనం ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర
- గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హులు, అనర్హుల జాబితాల ప్రదర్శన
- సీబీఎస్‌ఈతో పాటు వివిధ పాఠశాలల్లో చదువుతున్న వారి పేర్లు జాబితాల్లో మాయం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పండుగగా అమ్మఒడి నిధుల విడుదల కార్యక్రమం (ఫైల్)

వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గుంటూరు జిల్లాలో వరుసగా నాలుగేళ్ల పాటు జగనన్న అమ్మఒడి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేశారు.

జిల్లావ్యాప్తంగా తల్లులకు వందల కోట్ల రూపాయల లబ్ధి	విద్యా సంవత్సరం	తల్లుల సంఖ్య	ఆర్థిక లబ్ధి
	2019-20	1,46,232	రూ.219.34 కోట్లు
	2020-21	1,55,330	రూ.232.99 కోట్లు
	2021-22	1,64,601	రూ.246.90 కోట్లు
	2022-23	1,59,594	రూ.239.39 కోట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని 1,730 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,00,732 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్మీడియెట్ విభాగంలో మరో 60వేల మంది ఉన్నారు. అయితే, తల్లికి వందనం పథకానికి 2,01,911 మంది విద్యార్థులను ఎంపిక చేసిన ప్రభుత్వం 1,32,746 మంది తల్లులను మాత్రమే అర్హులుగా గుర్తించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ రూ.15వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలిపింది. ప్రభుత్వ ఆంక్షలతో దాదాపు లక్ష మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందడం లేదు. ఇంటర్మీడియెట్ విభాగంలో మరో 60వేలను కలుపుకుంటే అనర్హుల సంఖ్య 1,60,000 ఉంది. జిల్లాలోని 1,074 ప్రభుత్వ పాఠశాలల పరిధిలో 93,464 మంది విద్యార్థులతో పాటు 656 ప్రైవేటు పాఠశాలల పరిధిలో మరో 2,61,086 మంది విద్యార్థులు ఉన్నారు.

రెండు వేల రూపాయల కోత

హామీలు గుప్పించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత తల్లుల ఖాతాల్లో రూ.13వేలు మాత్రమే జమ చేశారు. మిగిలిన రూ.రెండు వేలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి నిధికి మినహాయించారు. సంబంధిత నిధులను జిల్లా కలెక్టర్ల ఆధీనంలో ఉంచే విధంగా జీవోలో పేర్కొన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తల్లులకు రూ.13వేలు ఇచ్చి, మిగిలిన రూ.రెండు వేలను వారి అంగీకారంతో పాఠశాలల అభివృద్ధి కోసం వినియోగించే ఏర్పాట్లు చేసిన సమయంలో టీడీపీ బురద చల్లింది. అయితే, ప్రస్తుతం కూటమి


ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర

ఆంక్షల ముసుగులో తల్లికి వందనం ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. గ్రామ, వార్డు సచివాయాల్లో అర్హులు, అనర్హుల జాబితాలను ప్రదర్శిస్తున్నారు. సీబీఎస్ఈతో పాటు వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లు జాబితాల్లో మాయమయ్యాయి. గత విద్యాసంవత్సరంలో టెన్త్, సీనియర్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు మొండి చెయ్యి చూపారు. టెన్త్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్, పాలిసెట్ వంటి కోర్సుల్లో చేరితేనే వారికి లబ్ధి కలుగుతుంది. సీనియర్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులను అనర్హులుగా చేర్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వాట్సప్ గవర్నెన్స్ నంబరు 95523 00009కు హాయ్ అని మెసేజ్ చేయడం ద్వారా సేవల్లో తల్లికి వందనం స్థితిని ఎంపిక చేసుకుని, తల్లి ఆధార్ నంబరు నమోదు చేయాలి. తద్వారా తల్లికి వందనానికి అర్హులైనదీ, అనర్హులైనదీ తెలుసుకోవచ్చు.

ప్రభుత్వం వైఎస్సార్ సీపీ తెచ్చిన విధానాన్నే అమలు పరుస్తోంది. 2023-2024, 2024-25 విద్యాసంవత్సరాలకు ఆర్థిక సాయాన్ని కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టింది.



గుంటూరు వసంతరాయపురంలోని వార్డు సచివాలయంలో తల్లికి వందనం అర్హుల జాబితా



విద్యుత్ వినియోగం, నెలసరి ఆదాయంతో అనర్హత వేటు

విద్యుత్ వినియోగం, నెలసరి ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోవడంతో తల్లికి వందనం పథకంలో వేలాది మంది విద్యార్థులు అనర్హులుగా మారుతున్నారు. గ్రామాల్లో నెలకు ఆదాయం రూ.10వేలు, పట్టణాల్లో రూ.12వేలకు మించితే కోత పడనుంది. గృహ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు దాటినా అనర్హత వేటు పడుతుంది. ఈ రెండు ఆంక్షలతో జిల్లాలో వేలాది మంది అనర్హులుగా మారారు.

ఫ్లైఓవర్ పనులు వారంలో ప్రారంభించాలి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని

గుంటూరు వెస్ట్: శంకర్ విలాస్ ఫ్లైఓవర్ ఫిల్లర్స్‌ను వారంలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాలులో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జిల్లా అధికారులతో జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని విలేకరులతో మాట్లాడారు. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం అవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్‌తోపాటు, విద్యుత్ స్తంభాల మార్పు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అమృత స్టేషన్ కింద మంజూరైన గుంటూరు, తెనాలి, మంగళగిరిల్లో పనులు వేగవంతంతోపాటు, మూడు వంతెనల వద్ద డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మంగళగిరి నియోజకవర్గంలో మంజూరు చేసిన ఆర్‌యూబీ పనులు కూడా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మూడో ఫేజ్ ఇన్నర్ రింగ్ రోడ్డు పనులు సీఆర్‌డీఏ అధికారులను సమన్వయం చేసుకుంటూ జీఎంసీ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలో శానిటేషన్ మరింత మెరుగుపరిచేలా శాసనసభ్యులను ఉన్నతాధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని చెప్పారు. నల్లపాడు వాటర్ ట్యాంకు స్థలం, వల్లూరువారితోటలోని కార్మిక శాఖ స్థలం అభివృద్ధి కోసం రెవెన్యూ శాఖ జీఎంసీ వారికి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కమర్షియల్ గార్బేజీ తరలింపు కోసం ఏజెన్సీల ఎంపిక త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో పెండింగ్ పనుల్ని వీలైనంత త్వరగా పూర్తి చేసినందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వంగా పని చేయాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, డెప్యూటీ మేయర్ షేక్ సజిల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఫ్రైట్' డిపో కార్యాలయం ప్రారంభం



డిపో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నల్లపాడులో ఫ్రైట్ డిపో (వ్యాగన్‌లను మరమ్మతు చేసే కార్యాలయం)ను సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డివిజన్ డీఆఎర్ఎం సుధేష్ణ సేన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాగన్‌లను మరమ్మతులు చేసే సమయంలో సిబ్బందికి వెయిటింగ్ చేసేందుకు నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం ఫ్రైట్ డిపో కార్యాలయ ప్రాంగణంలో చెట్లను నాటారు. అక్కడ నుంచి పట్టాభిపురంలోని గుంటూరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రమాద ఘంటికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివిజన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీఆర్ఎం సైమన్, సీపీఎం గతిశక్తి మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ జె.వి. అనూష, సీనియర్ డీఎంఈ ఎం.రవికిరణ్, సీనియర్ డీసీఎం సీహెచ్. ప్రదీప్‌కుమార్, సీనియర్ డీఎం జె.శ్రీనాథ్, సీనియర్ డీఎస్‌టీఈ జి.రత్నాకర్, సీనియర్ డీఈఈ జి.సూర్యనారాయణ, సీనియర్ డీఈఈ పి.రవితేజ, డీఎస్‌సీ మధుసూదనరావు పాల్గొన్నారు.

ఆర్‌ఓబీల నిర్మాణానికి రూ.572.47 కోట్లు మంజూరు

గుంటూరు నగరంలోని శామలానగర్, సంజీవయ్య నగర్‌లలో రెండు ఆర్‌ఓబీలకు గాను రైల్వే శాఖ రూ.159.59 కోట్లు మంజూరు చేయడంపై రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు నియోజక వర్గ శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఐదు దశాబ్దాల కలగా ఉన్న శంకర్ విలాస్ ఆర్‌ఓబీతో పాటు గడ్డిపాడు, పెద పలకలూరు, నందివెలుగు, మంగళగిరిల్లో ఆర్‌ఓబీల నిర్మాణాలకు గానూ రూ 572.47 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని మూడు వంతెనల వద్ద డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సహకరించాలని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను వారు కోరారు.

'కూటమి'పై పోరుకు న్యాయవాదులు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు: ప్రభుత్వం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే సామాజిక బాధ్యతగా న్యాయవాదులు పోరాటానికి సిద్ధం కావాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. జేకేసీ కళాశాల రోడ్డులోని వికాస్ ఇన్ ఫంక్షన్ హాలులో శుక్రవారం న్యాయవాదుల సమావేశం పార్టీ జిల్లా విభాగం, లీగల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో, పార్టీ అభ్యర్థులు ఓటమి పాలై బాధతతో బయకు రాలేని పరిస్థితుల్లో న్యాయవాదులు కార్యకర్తలకు ఎంతో భరోసా కల్పించి అండగా నిలిచారని తెలిపారు. వైఎస్సార్ సీపీ హయాంలో 300 మందికి అనేక పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. వై.ఎస్.జగన్ చెప్పిన విధంగా పార్టీని రాష్ట్రం, దేశంలో అతిపెద్ద శక్తిగా తయారు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఒక మోడల్‌గా తీసుకునే విధంగా గుంటూరు న్యాయవాదులు పని చేశారని కొనియాడారు.

కార్యకర్తలు, నేతలకు అండగా నిలవాలి

సభకు అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఐదేళ్లపాటు కార్యకర్తలు, నేతలకు అండగా నిలవాల్సిన బాధ్యత లీగల్ విభాగంపై ఉందని తెలిపారు. పరిపాలన కన్నా, కక్షసాధింపు చర్యలకు కూటమి సర్కార్ ప్రాధాన్యత ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాదులు ఏడాది కాలంలో ఇచ్చిన ధైర్యం అద్భుతమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

న్యాయవాదుల పోరాటం అద్భుతం

ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ న్యాయవాదులు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికలు జరిగిన అనంతరం జరుగుతున్న పరిణామాలు, కేసులు, దాడులు, ప్రభుత్వ వైఫల్యాలపై న్యాయవాదులు చేస్తున్న పోరాటం అద్భుతమని ప్రశంసించారు. భవిష్యత్తులో సైతం న్యాయవాదుల ఆవశ్యకత అవసరమని తెలిపారు.

మహిళా న్యాయవాదులు స్పందించాలి

పార్టీ గుంటూరు జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని తెలిపారు. వై.ఎస్.జగన్ హయాంలో చట్టానికి లోబడి పరిపాలన కొనసాగిందని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మహిళ న్యాయవాదులు స్పందించాలని ఆయన సూచించారు.

తప్పుడు కేసులతో వేధింపులు

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలపై సద్భావం లేని చంద్రబాబు సర్కార్ వారిని వేధింపులకు గురి చేస్తోందని విమర్శించారు. కుట్ర పూరితంగా కేసులు నమోదు చేస్తూ ఎంతో మంది గ్రామాలు వదిలి వెళ్లే పరిస్థితి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి గ్రామాలకు వస్తుంటే తప్పుడు కేసులు పెట్టిస్తూ వారిపై దాడులు చేయడం దుర్మార్గమని ఖండించారు. మీడియాపై ఆంక్షలు పెట్టడం సరికాదని హితవు పలికారు. 'సాక్షి'ని మూసివేయించేందుకు దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నారని మండిపడ్డారు.

లీగల్ విభాగం సేవ అభినందనీయం

పార్టీ విజయవాడ పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు ఉన్నారన్న ధైర్యంతోనే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఉన్నారని తెలిపారు. సామాన్యుడికి న్యాయ సహకారం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా అందిస్తున్నారని ప్రశంసించారు. ఇందులో లీగల్ విభాగం సభ్యుల సేవ అభినందనీయమన్నారు.

చట్టం దుర్వినియోగం

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ కూటమి సర్కార్ చట్టాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. బార్ కౌన్సిల్ సభ్యులు వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు సుశిక్షితమైన సైనికుల్లా ముందుకు సాగాలని తెలిపారు.

పెరిగిపోతున్న కూటమి అకృత్యాలు

లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అకృత్యాలు నానాటికి పెరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా న్యాయవాద వ్యవస్థ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయ కర్త బలసాని కిరణ్‌కుమార్, లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు కళ్లం హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కుప్పడం పట్టు చీరకు జాతీయ అవార్డు

- ఓడీఓపీ కింద అవార్డు ప్రదానం
- ఢిల్లీలో అవార్డు అందుకోనున్న బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి
- చీరాల కుప్పడం చీరకు ప్రాచుర్యం



కుప్పడం పట్టు చీరను పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకట మురళి, బృంద సభ్యులు

బాపట్ల: చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించనుంది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. జూలై 14వ తేదీన న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరుగునుందని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. చీరాల కుప్పడం పట్టు చీరకు ప్రకటించిన జాతీయ అవార్డును బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి న్యూఢిల్లీలో అందుకోనున్నారు. సంప్రదాయ మగ్గాలపై నేతన్నలు నేసిన చీరాల కుప్పడం చీరలకు మార్కెట్‌లో ఇప్పటికే కొంత డిమాండ్ ఉంది. యంత్రాల చొరబాటుతో కుప్పడం చీరల ఉత్పత్తి సన్నగిల్లిందని కార్మికులు ఆందోళన చెందుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో చేనేతల ఆశలు పునర్జీవం పోసుకున్నాయి. ఈ ఏడాది జనవరి 9న కేంద్ర బృందం సభ్యులు ఇష్ దీప్, డాక్టర్ దివ్యడింగ్రా క్షేత్రస్థాయి పరిశీలనపై బాపట్ల చీరాలలో పర్యటించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కుప్పడం చీరల ప్రదర్శనను పరిశీలించారు. అవార్డును జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి జూలై 14వ తేదీన అవార్డు అందుకోనున్నారు.

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,402
అమ్మకాలు	46,207
నిల్వ	6,136

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,500
నంబరు–5	10,000–13,000
273	10,000–12,500
341	10,000–13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–14,200
నంబరు–5	10,000–13,000
341	10,000–14,000
సూపర్ –10	10,000–13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,500 – 14,200
బాడిగ–355	10,000 – 13,500
దేవనూరు డీలక్స్	10,000 – 13,000
ఆర్మూర్	9,800 – 11,200
తాలుకాయలు	5,000–7,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,600
బాడిగ–355	10,000 – 13,400
దేవనూరు డీలక్స్	10,000 – 13,800
తాలు	5,000 – 7,000

–కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 867

కొమ్ములు : 693 బస్తాలు

కనిష్ట :	(ధర రూ॥ల్లో) గరిష్ట :	మోడల్ :
9,700	10,250	10,225

కాయలు : 174 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,700	10,250	10,225

మొత్తం అమ్మకాలు : 650.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

ట్రాఫిక్ సిబ్బందికి నూతన బైకులు

నరసరావుపేట రూరల్: జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు కేటాయించిన 15 నూతన ద్విచక్ర వాహనాలను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు శుక్రవారం ఆయా పోలీస్ స్టేషన్‌లకు అందజేశారు. ట్రాఫిక్ నియంత్రణ విధుల్లోని సిబ్బందికి పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ 15 ద్విచక్ర వాహనాలను కేటాయించింది. ఇందులో 14 అపాచి బండ్లు, ఒక బుల్లెట్ వాహనం ఉన్నాయి.

లాంలో మిరప విత్తనాలు సిద్ధం



ఎల్‌సీఏ 643 రకం



ఎల్‌సీఏ 625 రకం

తెనాలి: ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం (లాం ఫారం)లో జూన్ 16వ తేదీ నుంచి మిరప రకాల ఫౌండేషన్ విత్తనం అమ్మనున్నట్లు ప్రాంతీయ ఉద్యాన పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్. సి. వెంకట రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఎల్‌సీఏ–643: ఇది పచ్చి, ఎండు మిర్చికి అనువైన రకం. కాయలు లేత ఆకుపచ్చ రంగులో పొడవుగా (13–14 సెం.మీ.) ఆకర్షణీయంగా ఉంటాయి. ఎండిన తరువాత కొంచెం ముడత కలిగి ఆకర్షణీయమైన ఎరుపుతో బ్యాడగి రకం మాదిరి ఉంటాయి. బెట్టను, కొంతవరకు జెమిని వైరస్‌ను కూడా తట్టుకొంటుంది. నల్లతామర పురుగు ఉధృతిగా ఉన్నప్పటికీ కొద్దిపాటి పురుగు మందుల పిచికారీతో, అధిక దిగుబడి ఇస్తుంది.

ఎల్‌సీఏ–625 : ఎండు మిరపకు అనువైనది. మొక్కలు బలిష్టమైన కొమ్మలతో ఎత్తుగా పెరుగుతాయి. కణుపులు దగ్గరగా ఉండి, కాపు చిక్కగా ఉంటుంది. ప్రధాన పొలంలో నేరుగా ఎద పెట్టడానికి మిక్కిలి అనువైన రకం. కాయలు సన్నగా, మధ్యస్థ పొడవుతో (8–10 సెం.మీ.) ఉంటాయి. తేజ రకాన్ని పోలి ఉంటాయి. పచ్చి కాయలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. సూటి రకాల్లో కెల్లా అధిక ఘాటు (45000–50000 ఎస్.హెచ్.యు), మంచి ఆకర్షణీయమైన ఎరుపు రంగు (60–65 ఏఎస్‌టీఏ) కలిగిన రకం. కాయ తోలు పలచగా ఉంటుంది. అధిక ఘాటు వల్ల కాయ కుళ్లు తెగులును కొంతవరకు తట్టుకుంటుంది. తాలు కాయలు తక్కువగా వస్తాయి.

ఎల్‌సీఏ–657: తొలకరి తరువాత నేరుగా ఎద పెట్టుకోవడానికి అనువైన రకం. జెమిని వైరస్‌ను తట్టుకుంటుంది. మొక్కలు ఎత్తుగా, దృఢమైన కాండంతో నిటారైన కొమ్మలు కలిగి, బలమైన వేరు వ్యవస్థను కలిగి ఉంటాయి. కాయలు పొడవుగా (11–12 సెం.మీ.), ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పండినప్పుడు ముదురు ఎరుపు రంగుతో తెల్లటి తొడిమ కలిగి ఆకర్షణీయంగా ఉంటాయి. కాయలు అధిక ఘాటు (50,000–55,000 ఎస్.హెచ్.యు), మంచి రంగును కలిగి ఉంటాయి. ఇది అధిక బెట్టను తట్టుకునే రకం.

16వ తేదీ నుంచి లభ్యత

విత్తనాలు కొనదలచిన రైతులు నేరుగా ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం లాం ఫారంలో జూన్ 16వ తేదీ మొదలు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల్లోపు విత్తనం లభ్యత ఉన్నంత వరకు పొందవచ్చును.(రెండవ శనివారం, ప్రతి ఆదివారం శెలవు దినాలు). కిలో విత్తనం ధర రూ. 1,200. విత్తనాలు ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం లాం ఫారంలో మాత్రమే లభిస్తాయి. అవే పేర్లతో బయట ఎవరైనా అమ్మితే రైతులు మోసపోవద్దని వెంకట రమణ సూచించారు. ఆసక్తి కలిగినవారు 99898 09554 / 9440592982 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నిబంధనలకు లోబడి విత్తనాలు అమ్మాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.నరసింహారావు



మాట్లాడుతున్న నరసింహారావు

కొరిటిపాడు(గుంటూరు): విత్తన డీలర్లు, వ్యాపారులు విత్తన నియంత్రణ చట్టం–1983కు లోబడి వ్యాపారం నిర్వహించాలని గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ)యు.నరసింహారావు స్పష్టం చేశారు. స్థానిక కృషీ భవన్‌లో విత్తన డీలర్లు, వ్యాపారులతో శుక్రవారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ విత్తన లైసెన్స్‌ను దుకాణాల వద్ద విధిగా ప్రదర్శించాలని తెలిపారు. విత్తన నిల్వలను తప్పకకుండా ధరల సూచిక బోర్డు నందు విధిగా ప్రదర్శించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, డెలివరీ చలానాలు, బిల్లు పుస్తకాలు తప్పకుండా స్థానిక వ్యవసాయ అధికారి ద్వారా ధ్రువీకరణ చేయించుకొని ఉపయోగించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గడువు తీరిన విత్తనాలను నిల్వ చేయడం, విక్రయించడం నేరమని తెలిపారు. మిరప, పత్తి విత్తనాల వివరాలను సంబంధిత వ్యవసాయ శాఖ అధికారికి తెలిపి, వారి ఆమోదంతో మాత్రమే విక్రయం చేయాలని ఆదేశించారు. రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, అందులో పంట రకం, లాట్ నంబరు వివరాలు తప్పకుండా నమోదు చేయాలని ఆదేశించారు. హెటీ(గ్లైసెల్) పత్తి విత్తనాల అమ్మకం, సాగుకు దేశంలో ఆమోదం లేదన్నారు. ఈ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా పరిధిలోని విత్తన డీలర్లు విధిగా ఫారం–డీని ప్రతి నెలా 5వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు. సమావేశంలో విత్తన ఏఓ ఓ.సునీల్, డీలర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదరించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్



సదస్సులో మాట్లాడుతున్న జియావుద్దీన్

గుంటూరు లీగల్: క్యాలెండరు యక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శుక్రవారం రామన్నపేటలోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థలో ప్రపంచ వృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవంపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులు మనకు జ్ఞానాన్ని, అనుభవాన్ని అందించే వారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో వృద్ధులు ఆర్థికంగా, మానసికంగా నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు జన్మనిచ్చి మన అభివృద్ధి కోసం కృషి చేస్తారని, కొంత మంది వారిని పట్టించుకోకుండా వదిలేస్తున్నారని చెప్పారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే బహుమతిగా ఇచ్చిన ఆస్తులను రద్దు చేసి తిరిగి వారి సంక్రమిస్తాయనే చట్టం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు ఆస్తులను ఇచ్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. నల్సా న్యాయ సేవల పథకం- 2016 ప్రకారం వృద్ధులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. సదస్సులో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, డాక్టర్ ప్రత్యూష , సుబ్బారావు, పెద్దలు పాల్గొన్నారు.

26 నుంచి ఆషాఢ మాసోత్సవాలు

- 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవరాత్రులు
- జూలై 8 నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు
- 3 రోజులు కాయగూరలు, ఆకుకూరలతో అలంకరణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాడ మాసోత్సవాలు, వారాహి నవరాత్రులు, శాకంబరీ ఉత్సవాలకు ఇంద్రకీలాద్రి సిద్ధమవుతోంది. ఈ నెల 26 నుంచి జూలై 24వ తేదీ వరకు ఆషాఢ మాసోత్సవాలు, 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవ రాత్రులు, జూలై 8 నుంచి 10వ తేదీ వరకు శాకంబరీదేవి ఉత్సవాలు జరగనున్నాయి.

ఆషాఢ మాసోత్సవాలు.. అమ్మవారికి సారె

ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీ. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు తమిళనాడు, కర్నాటకల నుంచి కూడా భక్తులు దుర్గమ్మకు సారె సమర్పిస్తారు. నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. మూలవిరాట్ దర్శనానంతరం ఉత్సవమూర్తికి సారెను సమర్పిస్తారు.

గుప్త నవరాత్రులు

ఆషాఢంలో దుర్గమ్మ సన్నిధిలో ఈ నెల 26 నుంచి జూలై 4వ తేదీ వరకు వారాహి నవరాత్రులు (గుప్త నవరాత్రులు) నిర్వహిస్తారు. ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లపై ఆలయ వైదిక కమిటీ, అర్చకులు ఈవోతో చర్చించారు.

శాకంబరీదేవి ఉత్సవాలు

ఇంద్రకీలాద్రిపై జూలై 8 నుంచి 10వ తేదీ వరకు శాకంబరీదేవి ఉత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉపాలయాల్లో దేవతామూర్తులు, ఆలయ ప్రాంగణాన్ని కాయగూరలు, ఆకుకూరలతో అలంకరిస్తారు. అమ్మవారికి అలంకరించిన ఆకుకూరలు, కాయగూరలతో తయారు చేసే కదంబం ప్రసాదం శాకంబరీదేవి ఉత్సవాల ప్రత్యేకత.

వైదిక కమిటీ, అర్చకులతో ఈవో సమీక్ష

దుర్గగుడిలో ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ఈవో శీనానాయక్ శుక్రవారం ఆలయ వైదిక కమిటీ, ప్రధాన అర్చకులు, ఆలయ ఏఈవో, ఫెస్టివల్ విభాగంతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. అమ్మవారి దర్శనంలో ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత దేవస్థానంపై ఉందని ఆలయ అధికారులతో పేర్కొన్నారు. దర్శన వేళలు, రద్దీ సమయాల్లో వ్యవహరించాల్సిన విధానాలు, ప్రస్తుతం అమలులో ఉన్న వీఐపీ ప్రత్యేక బ్రేక్ దర్శన వేళలు వంటి అంశాలను చర్చించారు. సమీక్షలో ఈఈ కోటేశ్వరరావు, వైదిక కమిటీ సభ్యులు శ్యావాశ్య మహర్షి, సీహెచ్ ఆంజనేయ ఘనాపాటి, ప్రధాన అర్చకుడు ఎల్. దుర్గాప్రసాద్, ఉప ప్రధానఅర్చకులు కోట ప్రసాద్, ఏఈవో ఎస్. రమేష్‌బాబు, బి. వెంకటరెడ్డి, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలకు తులసి సీడ్స్ బస్సు వితరణ

నేడు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి పెమ్మసాని



తులసి రామచంద్ర ప్రభు

గుంటూరు మెడికల్: ప్రముఖ పారిశ్రామికవేత్త, తులసీ సీడ్స్ అధినేత తులసి రామచంద్ర ప్రభు నర్సింగ్ కళాశాలకు బస్సు వితరణగా అందజేశారు. విద్యార్థులు ప్రతిరోజూ ప్రాక్టికల్స్ కోసం గుంటూరు జీజీహెచ్‌కు వచ్చేందుకు గోరంట్ల నుంచి బస్సు సౌకర్యం లేక చాలా ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యుడు రామచంద్ర ప్రభు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పెద్ద మనస్సు చేసుకుని బస్సు కొనుగోలుకు అంగీకారం తెలిపారు. కొనుగోలు చేసిన బస్సును శనివారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గోరంట్లలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్.స్లివమ్మ తెలిపారు.

జీజీహెచ్‌కు రూ. 10 కోట్లు వితరణ

తులసి రామచంద్ర ప్రభు జీజీహెచ్ అభివృద్ధి సంఘం సభ్యుడిగా కూటమి ప్రభుత్వం వచ్చాయక ఎన్నికయ్యారు. ఆయన హెచ్‌డీఎస్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించగానే జీజీహెచ్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన సర్వీసు బ్లాక్‌నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు రూ. 10 కోట్లు భవన నిర్మాణం కోసం విరాళంగా ప్రకటించారు. గత నెలలో భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. త్వరలోనే తులసి రామచంద్ర ప్రభు విరాళం రూ. 10 కోట్లతో సర్వీసు బ్లాక్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. తులసి రామచంద్ర ప్రభుకు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ కృతజ్ఞతలు తెలిపారు.

జెడ్పీలో మున్సిపల్ ఉపాధ్యాయుల ఆందోళన

క్లస్టర్ వారీగా ఖాళీలను చూపించాలని డిమాండ్



కౌన్సెలింగ్ హాల్లో బైఠాయించిన ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: క్లస్టర్ వారీగా ఖాళీలను చూపించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఉపాధ్యాయులు శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆందోళన నిర్వహించారు. ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌లో భాగంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో ఖాళీలను ప్రదర్శిస్తూ, మాన్యువల్ విధానంలో ఎంపిక చేసుకునేలా కౌన్సెలింగ్ నిర్వహించారు. దీనిపై డీఈవో సీవీ రేణుక, ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సమాధానమిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జెడ్పీలో గత మూడు రోజులుగా ఎస్జీటీలకు నిర్వహిస్తున్న బదిలీల కౌన్సెలింగ్ శనివారం ముగియనున్నట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. సీనియార్టీ జాబితాలోని వరుస క్రమంలో 2,401 నుంచి చివరి వరకు పేర్లు ఉన్న ఉపాధ్యాయులు శనివారం హాజరుకావాలని ఆమె సూచించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ఎమ్మెల్యే గల్లా మాధవి సీరియస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, వర్కర్లను పెంచినప్పటికీ మెరుగుపడటం లేదని పశ్చిమ గల్లా మాధవి నగర కమిషనర్ పులి శ్రీనివాసులపై ఫైర్ అయ్యారు. పని చేసే వారు తక్కువ, సూపర్‌వైజ్ చేసే వారు ఎక్కువగా ఉంటే ఏ విధంగా మెరుగుపడుతుందని మండిపడ్డారు. జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో కొన్ని వార్డుల్లో స్పెషల్ శానిటేషన్ అని పెట్టి పనులు చేసినప్పటికీ 25శాతం కూడా ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం మెరుగుపడలేదని తెలిపారు. వార్డుల్లో ప్రజలకు సమాధానం చెప్పే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య మెరుగుదలకు పటిష్ట చర్యలు తీసుకోవాలని చెప్పారు.

వైభవంగా దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్‌లోని శ్రీ విఘ్నేశ్వరస్వామి సహిత శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి, శ్రీ విద్యా సరస్వతి, పర్వత వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం కొనసాగాయి.గోపూజ, గురు ప్రార్ధన, మండపారాధన, మండప దేవత హోమాలు వేదమంత్రాలతో నిర్వహించారు. శ్రీ పర్వతవర్ధిని, మాలికాపురోత్తమ్మ అమ్మవార్లకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకాలు నిర్వహించారు. అనంతరం చండీ హోమం, తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ పూజారులు శివకుమారశర్మ, చంద్రశేఖరశర్మ, అర్చక బృందం భక్తి శ్రద్ధలతో పూజలు, అమ్మవార్లకు విశేష అలంకారాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఏంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతులు, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, కొండారెడ్డి, కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

నగరపాలక సంస్థ ఎంహెచ్ఓ సరెండర్

నెహ్రూనగర్: నగరంలో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్య వైఖరి కారణంగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్ఓ) డాక్టర్ ఎం.రవిబాబుని మాతృశాఖకు సరెండర్ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనల్లో పలుమార్లు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సూచించిన పనుల్లో పర్యవేక్షణ లోపం కనపరచడంతో ఆయన్ను సరెండర్ చేశామని పేర్కొన్నారు. పరిపాలన అవసరాల రీత్యా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి రామారావు, పశ్చిమ నియోజకవర్గానికి సోమశేఖర్‌లను ఇన్‌చార్జి ఎంహెచ్ఓలుగా కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని వెల్లడించారు.

సోషల్ వెల్ఫేర్ డీడీగా చెన్నయ్య

నెహ్రూనగర్: జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ(డెప్యూటీ డైరెక్టర్)గా యు. చెన్నయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా డీఎస్‌డబ్ల్యూఓ(జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్)గా పని చేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరుకు వచ్చారు. గతంలో ఇక్కడ డీడీగా పనిచేసిన డి.మధుసూదన్‌రావు ఆరు నెలలకుపైగా సెలవులో ఉండటంతో బాపట్ల జిల్లా డీఎస్‌డబ్ల్యూఓగా పని చేస్తున్న రాజా దేబోరా గుంటూరు జిల్లా ఇన్‌చార్జి డీడీగా పనిచేశారు.

లారీని ఢీకొట్టిన బస్సు..నలుగురికి గాయాలు



ముందు భాగం నుజ్జు నుజ్జయిన బస్సు

అద్దంకి: ముందు వెళ్తున్న లారీని బస్సు ఢీకొని బస్సులోని నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని చిన్నకొత్తపల్లి డొంక వద్ద అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగింది. అందిన సమాచారం మేరకు ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు కందుకూరు నుంచి హైదరాబాద్ బయలుదేరింది. ఆ బస్సు మండలంలోని చిన్నకొత్తపల్లి డొంక వద్దకు రాగానే, అదే మార్గంలో చిన్నకొత్తపల్లి మిల్లు వద్దకు వెళ్లే క్రమంలో మలుపు తిరుగుతున్న లారీని వెనుకగా ఢీకొట్టింది. దాంతో బస్సులో కుదుపు రావడంతో అందులో ప్రయాణిస్తున్న షేక్ యాకోబ్‌బాషాతోపాటు ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, 108 సిబ్బంది అక్కిడికి చేరుకున్నారు. సంఘటన వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు. క్షతగాత్రుడు షేక్ యాకోబ్ బాషాను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం అందించారు. ఈ ఘటనలో బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జయింది.

తరచూ ప్రమాదం..డెడ్ స్పాట్

ఈ స్థలంలో గ్రామానికి వెళ్లే రోడ్ క్రాసింగ్ ఉండటంతో పలుమార్లు కార్లు బోల్తా కొట్టడం, ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలసి పోయిన సంఘటనలు కోకొల్లలు. ఇక్కడ ప్రమాద నివారణకు సరైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంతర్ జిల్లా దొంగను పట్టుకున్న పోలీసులు

జె.పంగులూరు: అంతర్ జిల్లా దొంగ పబ్బరాజు వెంకట యుగంధర్‌ను పట్టుకున్నట్లు శుక్రవారం ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. బూదవాడ గ్రామానికి చెందిన వజ్రాల కృష్ణారెడ్డిని వెంకట యుగంధర్ గత నెలలో ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. మంచి వ్యక్తి అని నమ్మి బూదవాడ గ్రామానికి చెందిన హనుమారెడ్డి ఇల్లును అద్దెకు ఇప్పించాడు. ఎంతో నమ్మకంగా ఉంటూ గత నెల 18న రాత్రి 7 గంటల సమయంలో నిందితుడు అన్నవరం ప్రసాదం అని మత్తు మందు కలిపి హనుమారెడ్డి, అతని భార్యకు ఇచ్చాడు. కొద్ది సేపటికే స్పృహ కోల్పోగా హనుమారెడ్డి భార్య మెడలోని బంగారు గొలుసును దొంగిలించి అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ విషయమై బాధితులు రేణింగవరం పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఎస్సై వినోద్‌బాబు తన సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని మంగళగిరి బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు, అతని వద్ద బంగారు రికవరీ చేసినట్లు ఎస్సై వినోద్‌బాబు తెలిపారు. నిందితుడు గుంటూరు జిల్లా తాడేపల్లి లోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిపారు.

